International Journal for Multidisciplinary Research (IJFMR)
E-ISSN: 2582-2160 ● Website: www.ijfmr.com ● Email: editor@ijfmr.com

# వరకట్న దురాచార నిరసనాస్త్రం - రాయప్రోలు వారి 'స్నేహలతాదేవి లేఖ'

**డా. పట్టపు శివకుమార్**

తెలుగు అధ్యాపకుడు అధ్యాపకుడు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి

**పరిచయం:**

**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో నవ్య కవులకు మార్గదర్శకులై, భావ కవితోద్యమానికి శ్రీకారం చుట్టిన నవ యుగకర్త రాయప్రోలు సుబ్బారావు గారు. ఆధునిక తెలుగు కవిత్వంలో సంప్రదాయ మార్గాన్ని విడవకుండానే ప్రాచీన, ఆధునిక కవితా రీతులలో రచనలు చేయటం రాయప్రోలు వారి విశిష్టత. ఆదర్శ ప్రేమతత్వాన్ని కవిత్వం ద్వారా ప్రకటించి, అమలిన శృంగారం అనే కొత్త పంథాను తెలుగు వారికి అందించిన ఖ్యాతి రాయప్రోలు వారికి దక్కుతుంది. రాయప్రోలు సుబ్బారావు గారు 1863 మార్చి 18వ తేదీన గుంటూరు జిల్లా లోని బాపట్ల తాలూకా గార్లపాడు అనే గ్రామంలో జన్మించారు. మేనమామ అయిన అవ్వారి సుబ్రమణ్య శాస్త్రి గారి దగ్గర రాయప్రోలు వారు ప్రాథమిక విద్యను అభ్యసించారు. రాయప్రోలు వారి ఉన్నత విద్య గుంటూరు, హైదరాబాదు, శాంతినికేతనం, కాశీ మొదలైన ప్రాంతాల్లో జరిగింది. వారి ఉద్యోగ జీవితం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రీడరుగా, ప్రొఫెసరుగా, వరంగల్లు కాలేజీలో ప్రిన్సిపాలుగా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధ్యక్షుడుగా కొనసాగింది. రాయప్రోలు వారి ప్రతిభా పాండిత్యాన్ని గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో గౌరవించింది.

వరకట్న దురాచారానికి బలైపోయిన స్నేహలత అనే యువతి తన తండ్రికి రాసిన లేఖలోని విషాద వృత్తాంతం గురించి పరామర్శించటం ఈ వ్యాసం లోని ప్రధాన విషయం.

**ముఖ్య పదాలు:** రాయప్రోలు సుబ్బారావు, స్నేహలతాదేవి ఖండకావ్యం, ఇతివృత్తం, తల్లిదండ్రుల వాత్సల్యం, ఆత్మార్పణం, వరకట్న దురాచారం, సంఘ సంస్కరణ,

**స్నేహలతాదేవి ఖండకావ్యం:**

రాయప్రోలు సుబ్బారావు గారు 'స్నేహలతాదేవి' అనే ఖండకావ్యం రచించారు. బెంగాలు ప్రాంతంలో స్నేహలత అనే యువతి వరకట్న దురాచారానికి నిరసనగా ఆత్మార్పణ చేసుకున్న సంఘటన ఇందులోని ప్రధాన ఇతివృత్తం. స్నేహలతాదేవి కథ ఆనాటి బెంగాలు ప్రాంతంలో జరిగిన ఒక యధార్థమైన విషాదగాథ. స్వాతంత్ర్యానికి పూర్వం బెంగాలు ప్రాంతంలో ప్రబలంగా ఉన్న వరకట్న దురాచారానికి గురై, స్నేహలత అనే పదిహేనేళ్ల యువతి ఆత్మాహుతి చేసుకొన్నది. ఆ విషాదవార్త ఆనాటి వార్తాపత్రికలలో ప్రకటించబడింది. రాయప్రోలు వారు జ్వరంతో బాధపడుతూ మంచాన విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో,

స్నేహలత విషాద వృత్తాంత వార్తను పత్రికలలో చదివినారు. ఆనాటి సాంఘిక దురాచారానికి బలైపోయిన స్నేహలత కథ రాయప్రోలు వారి కవి హృదయాన్ని ఎంతగానో కదిలించింది. ఈ నేపథ్యంలోనే రాయప్రోలు వారు 'స్నేహలతాదేవి' అనే పేరుతో ఖండకావ్యం రచించారు. వరకట్న దురాచారానికి నిరసనగా ఆత్మబలి దానం చేసుకున్న 'స్నేహలత' రాయప్రోలు వారి ఖండకావ్యంలో విషాద నాయికగా ప్రసిద్ధి గాంచింది.

**ఇతివృత్తం:**

కవి వాస్తవ సంఘటనను తన కావ్యంలో ఇతివృత్తంగా గ్రహించినప్పుడు సందర్భోచితంగా కొన్ని మార్పులు చేయటం సహజం. అందువల్లనే రాయప్రోలు వారు 'స్నేహలతాదేవి' ఖండ కావ్య ఇతివృత్తానికి ఉదాత్తమైన విషాద వాతావరణాన్ని కల్పించటం కోసం ప్రియంవద అనే పాత్రను సృష్టించాడు. ఆమె స్నేహలతకు ప్రియమైన స్నేహితురాలు. ఒకనాటి సాయంకాలం ఆ యువతులు ఇద్దరూ కలిసి గంగానదికి వెళ్ళినారు. అప్పుడు స్నేహలత గంగానది ప్రాశస్త్యాన్ని ఎంతో గొప్పగా ప్రశంసించింది. కానీ వరకట్న దురాచార ఫలితంగా వివాహం కాని కన్నెలు, అప్పుల పాలైపోయిన తండ్రులు గంగలో పడి మరణించిన అనేక విషాద సంఘటనలను ప్రియంవద స్నేహలతకు వినిపించింది. ఈ సన్నివేశంలో గంగానదిని గురించి వారు ఇద్దరూ చేసిన పరస్పర విరుద్ధమైన పరామర్శ, తరువాత జరుగబోయే స్నేహలత ఆత్మాహుతికి ఒక ముందస్తు సూచనగా కనిపిస్తుంది.

**వరకట్నం దురాచారం:**

హరేంద్రశర్మ అనే ఒక సామాన్య గృహస్థుని జ్యేష్ఠ పుత్రిక స్నేహలత. వరకట్నం ఇచ్చే స్తోమత లేకపోవటం వలన స్నేహలత వివాహం ఆమె తల్లిదండ్రులకు ఒక సమస్యగా మారింది. వారికి ఉన్న ఆస్తి అంతా కేవలం వారి ఇల్లు మాత్రమే. అందువలన హరేంద్రశర్మ గత్యంతరం లేక తన ఇంటిని అమ్మి, ఆ డబ్బుతో స్నేహలత పెళ్లి చేయాలనుకుంటాడు. ఎందుకంటే వయసుకు వచ్చిన కూతురికి పెళ్లి చేయలేదనే చుట్టుపక్కల వారి నిందల కన్నా దారిద్ర్యమే మేలని అతని భావన. అయితే తండ్రి తీసుకున్న నిర్ణయం స్నేహలత మనస్సును వికలం చేసింది. తల్లిదండ్రులు, చిన్నారి చెల్లెలు, తమ్ముడు తన పెళ్లి వలన నిరాశ్రయులై దుర్భర దారిద్ర్యంతో చితికి పోవటాన్ని ఆమె భరించలేక పోయింది. అంతేకాక తన పవిత్రమైన కన్యత్వం వరకట్న దురాచార కళంకంతో నిందితం కాకూడదని కూడా స్నేహలత భావించింది.

**స్నేహలత విషాదగాథ:**

స్నేహలత సంస్కారవతి. ఆమె తన స్నేహితురాలు ప్రియంవదతో కలిసి గంగానదికి వెళ్లి వచ్చిన నాటి రాత్రి రెండవ జాము తర్వాత ఇంటి పెరటిలోకి పోయింది. తనకు పెళ్లి కాలేదని పరితపిస్తున్న తల్లిని, కట్నం ఇవ్వలేక కష్టాల పాలైన తండ్రిని తలచుకొని స్నేహలత పరితపించింది. తన తాత ముత్తాతలు వారసత్వంగా నిలిపిన తమ ఇల్లు పరులపాలు కాకూడదని స్నేహలత నిశ్చయించుకున్నది. కుల, రూప, గుణాలు గల వరుని కోసం తన తండ్రి ఎన్ని ప్రయత్నాలు చేశాడో స్నేహలతకు తెలుసు. కానీ ఆ ప్రయత్నాలు అన్నీ విఫలమై, తండ్రి పడే వేదనను కూడా ఆమె అర్థం చేసుకొన్నది. అందుకే తన ప్రాణాలను అర్పించి అయినా ఈ వరకట్న దురాచారాన్ని రూపుమాపుటకు ప్రయత్నించాలని స్నేహలత అనుకొన్నది. అలా జరిగితే తన తండ్రి బాధలు తీరిపోతాయి. అలాగే తన కన్యత్వానికి కూడా కళంకం రాదని ఆమె అనుకున్నది. అందుకే పితృ గృహ

రక్షణకు ఆత్మాహుతి చేసుకోవటమే మార్గమని స్నేహలత భావించింది. అంతేకాకుండా ఆ విధంగా చేస్తే తన పవిత్ర కన్యత్వం వరకట్న దురాచార కళంకం చేత మలినం కాదనే అభిప్రాయం కూడా ఆమెకు కలిగింది.

**స్నేహలత ఆత్మార్పణం:**

అనాదిగా వంగదేశీయులకు కనకదుర్గ ఆరాధ్య దేవత. స్నేహలత కూడా కనకదుర్గ భక్తురాలు. ఒకనాటి రాత్రి కలలో ఒక మధురనాదం స్నేహలత వీనులకు అమృతం వలె సోకింది. అప్పుడు ఆమెకు జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ కనకదుర్గ సాక్షాత్కరించింది. మందస్మిత వదనంతో వాత్సల్యం చిందిస్తూ, దేవి స్నేహలతను తక్షణమే తన మందిరానికి రమ్మని పిలిచింది. అప్పుడు తన ప్రాణ పరిత్యాగ సంకల్పానికి దుర్గ అంగీకారం లభించిందని స్నేహలత భావించింది. అందుకే వరకట్నం ఇవ్వకుంటే మంగళ సూత్రధారణకు అర్హురాలు కానిచో, శరీరాన్ని దగ్ధం చేసివేయటమే మంచిదని స్నేహలత నిశ్చయించుకున్నది. ఈ విధంగా స్నేహలత అనుకుంటున్న సమయంలో, ఆమె శిరస్సు మీద ఒక పక్షి 'హో' అని అరుస్తూ వెళ్ళింది. అప్పుడు స్నేహలత మనస్సులో దుర్గను స్మరించుకొని, 'అనుమతించితివా తల్లీ' అని ఇంటి లోకి వచ్చింది. స్నేహలత అంతకుముందే తన తండ్రికి రాసిన లేఖను అరుగు మీద ఉంచింది. తాను ధరించిన ఉత్తమ వస్త్రాలను తీసి, తైల వస్త్రాన్ని ధరించింది. ఆమె మనస్సు దుర్గను ధ్యానించింది. మరికొన్ని క్షణాలకు అగ్ని జ్వాలలు ఎగసి స్నేహలత శరీరాన్ని దగ్ధం చేసినాయి. పరిమాణువంత పరిమాణం ఉన్న ఆమె ఆత్మ నక్షత్ర లోకానికి వెళ్ళింది. స్నేహలత శరీరమనే చిరుదీపం ఆరిపోయి, మహా తేజస్సులో కలిసి పోయింది.

ఈ సందర్భంలో రాయప్రోలు వారు స్నేహలత ఆత్మార్పణకు ఆమె తల్లిదండ్రులు పడిన ఆవేదనను,

*"స్నిగ్ధ కాంచనలతవంటి స్నేహలతను*
*కడుపునం గాంచ నోచిన పుడమి వేల్పు*
*గోలు గోలున నేడ్చె నా కూతు జూచి,*
*బ్రాహ్మణి నిరస్త చైతన్యభాతి గూలె"* (స్నేహలతాదేవి, 1914. పే.34)

అని ఆర్ద్రంగా వర్ణించాడు. మేలిమి అపరంజ తీగవంటి స్నేహలత జన్మించినది అని సంతోష సంబరాలను పొందిన తండ్రి, ఇప్పుడు ఆమె కాలి బూడిదైనదని గోలుగోలున ఏడ్చినాడు. స్నేహలత తల్లి కుమార్తెకు పట్టిన దుస్థితిని చూసి నిశ్చేష్టురాలై కూలబడింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తమ గారాల కూతురు ఇలా కళ్ళ ముందే కాలిపోతే ఆ తల్లిదండ్రుల మనోవేదన ఎంత దుర్భరంగా ఉంటుందో ఈ సన్నివేశం వలన మనకు తెలుస్తుంది.

పన్నెండు సూర్య మండలాలను దాటి, చైతన్య తరంగం వలె అనంత విశ్వంలో కలిసి పోయిన స్నేహలతకు కలిగిన దురవస్థను, శోకంతో విలపించే ఆమె తల్లిదండ్రులును అక్కడివారు చూడలేకపోయారు. నిర్జీవంగా పడి ఉన్న స్నేహలత తల్లిదండ్రులను బంధువులు ఓదార్చారు. స్నేహలతను మనస్సులో ఎప్పుడు కూడా మరువలేనని ప్రియంవద కన్నీరు కార్చింది. స్నేహలత తన చేతులతో స్వయంగా రాసిన జాబును ప్రియంవద తడబడే గొంతుతో చదివింది.

**స్నేహలత తండ్రికి రాసిన లేఖ:**

వరకట్న దురాచారానికి నిరసనగా స్నేహలత ఆత్మార్పణ చేసుకున్నది. అంతకుముందు ఆమె తన తండ్రికి ఒక లేఖను రాసింది. స్నేహలత "పూజ్యుడవగు తండ్రీ!" అని ఎంతో ప్రేమతో తన తండ్రిని సంబోధిస్తూ ఈ లేఖను ప్రారంభించింది. ఈ సంబోధన తండ్రి పట్ల ఆమెకు గల ఆదరాభిమానాలను వ్యక్తం చేస్తుంది. ఆ తర్వాత ఆమె తన తండ్రికి తన మనసులోని ఆకాంక్షను ఈ విధంగా తెలియపరిచింది. 'నా పెళ్లి కోసం ఈ అనాది గృహాన్ని అమ్మకానికి పెట్టడాన్ని నేను వినలేను. మీరు ఇలా చేయకూడదు. ఇకముందు చేయవలసిన ఆవశ్యకత కూడా ఉండబోదు' అని పలికింది. ఆ తర్వాత స్నేహలత తన మనసులోని నిశ్చయాన్ని తండ్రికి ఈ విధంగా తెలిపింది.

*"ఎల్లి చిరుప్రొద్దుచాయ రేకెత్తకుండ*
*నిశ్చలానంద బాంధవ నిలయమునకు*
*నడచి పోవంగ గలదు నీ కడుపునందు*
*దుర్ముహూర్తాన బుట్టిన దుహితయాత్మ "* (స్నేహలతాదేవి, 1914. పే.36)

అంటూ పలికింది. 'నీ కడుపున దుర్ముహూర్తాన జన్మించిన నీ పుత్రిక రేపు తెల్లవారక ముందే నిశ్చలానంద స్వరూపిణి మందిరానికి చేరుకోగలదు' అని తానూ ఆత్మార్పణ చేసుకోబోతున్న విషయాన్ని స్నేహలత తండ్రికి నర్మగర్భంగా తెలిపింది.

ఆ తర్వాత స్నేహలత తల్లిదండ్రులు తనను పెంచిన తీరును గుర్తుచేసుకుని, 'లలిత సుకుమారమైన లతవలె నీ రొమ్ము మీద పాకి మురిసిపోయిన నన్ను అల్లారు ముద్దుగా పెంచావు. కలలో కూడా నా సౌఖ్యం గురించి కలవరించావు. నీ ప్రేమ సమస్తం నాకు అర్పించావు. కన్న తల్లిదండ్రులకు కంఠమాలగా పదిహేనేళ్ల ప్రాయం వచ్చే వరకు పెరిగాను. రాజాధిరాజుల పుత్రికలు కూడా నేను పొందిన సుఖాన్ని అనుభవించలేరు' అని ఆ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నది. తన పెళ్లి చేయటానికి తండ్రి పడిన కష్టాలను తలచుకుంటూ, 'మొన్నటి రోజున మధ్యాహ్నం వరకు నీవు కాళ్ళు వాచేటట్లు గడపలన్నీ తిరిగి వచ్చావు. అప్పుడు నీ ముఖంలో ఎంతో దైన్యాన్ని చూశాను. కన్న కడుపు తీపిని చంపుకోలేక, ఇంటిని విక్రయించటానికి నిశ్చయించుకున్నావు. అప్పుడు దుఃఖంతో నీవు పలికిన 'ఇక అంతా అయిపోయింది' అనే శోక పూరితమైన మాటను విని నా మనస్సు ఎంతో తల్లడిల్లింది. అభాగ్యవంతురాలైన నీ కూతురు ఇన్ని కష్టాలను తెచ్చి పెట్టిందా అని పరితపించాను' అని స్నేహలత తన మనో వేదనకు గల కారణాన్ని తండ్రికి తెలిపింది.

స్నేహలత తన పుట్టుక వలన తల్లిదండ్రులకు కలిగిన కష్టాలను గుర్తుచేస్తూ, 'నన్ను కన్న నేరానికి, నన్ను వివేకవతిగా చేసిన పాపానికి తగిన ప్రాయశ్చిత్తాన్ని అనుభవించావు. అది మీకు వారసత్వంగా వచ్చిన ఇంటిని పోగొట్టుకునేలా పరిణమించింది. కన్నతండ్రి హృదయ భారం తొలగించ లేకపోతే కన్యకు వివాహకాంక్ష ఉండటం ఎందుకు? ఆర్యకుల ధర్మ సంప్రదాయాలను ఈమాత్రం తెలుసుకోలేరా?' అని పలికింది. ఈ మాటల వలన స్నేహలతకు ఆమె తల్లిదండ్రుల మీద గల అవ్యాజమైన ప్రేమాభిమానాలు తెలుస్తున్నాయి. అలాగే ఆచార సంప్రదాయాల పట్ల ఆమెకు గల అపారమైన అవగాహన కూడా మనకు తెలుస్తుంది. అలాగే తన వివాహం కాలేదని తల్లిదండ్రులు పడిన మనోవేదనను కూడా స్నేహలత అర్థం చేసుకున్నది. అందుకే ఆమె తన కన్నవారి కోసం ఆత్మార్పణకు కూడా సిద్ధపడింది.

ఈ సందర్భంలో స్నేహలతకు వరకట్న నిషేధానికి ముందుకురాని భారతీయ యువకులు గుర్తుకువచ్చారు. అందుకే ఆమె తన సోదర యువకులను మనసులో ఒకసారి స్మరించుకున్నది. వరదలో చిక్కుకొని ఆక్రందించే తల్లి బిడ్డలను, ప్రాణాలకు తెగించి కాపాడిన యువకులు ఎందరో ఉన్నారు. మాతృ దేశాభిమానంతో విదేశీ వస్తువులను తాకబోమని ప్రతిజ్ఞలు చేసిన యువకులు కూడా అనేకమంది ఉన్నారు. అటువంటి వారి త్యాగదీక్ష స్నేహలతకు ఎంతో ఆశ్చర్యం కలిగించింది. కాని వరకట్న దురాచారాన్ని నిరసించటానికి మాత్రం ఒక్కరైనా లేకపోవటాన్ని చూసి ఆమె ఎంతో విచారించింది. అందుకే స్నేహలత తన మనసులో, 'భరతభూమిలో జన్మించిన యువకులు అనుచితమని భావించక వరకట్నం ఆశించటం తగునా' అని ఆక్రోశంతో పలికింది.

ఆ తర్వాత స్నేహలత తనకు కలలో కనకదుర్గాదేవి కనిపించి, తన మందిరానికి రమ్మని వాత్సల్యంతో పిలిచిందని తండ్రికి తెలిపింది. అప్పుడు ఆమె మనస్సులో తల్లిదండ్రుల పట్ల కలిగిన ప్రేమాభిమానాలను వెల్లడిస్తూ, 'అప్పుడు నిన్ను గూర్చి అనుకున్నాను. నిరంతరం శోకంతో దురపిల్లు తల్లిని తలచుకున్నాను. ప్రేమపాశంతో ఇంటిని కలకలలాడేటట్లు చేసే నా చిన్నారి చెల్లెలిని, తమ్ములను స్మరించుకున్నాను. ఐహిక జీవిత కాంక్షలపై నాకు అనాదరం కలిగింది. పితృగృహాన్ని నిలబెట్టి మీ వ్యధలను తీర్చాలని నిశ్చయించి, దుర్గ వెంట వస్తానని అన్నాను. నేను మరణిస్తాను. నా చితాభస్మాన్ని మీరు కన్నీటితో తడుపుతారు. అయినా పితార్జితం నిలుస్తుంది. నా కన్యత్వం మలినం గాక అవనిలో అలరారును.' అని ఎంతో ఆర్ద్ర చిత్తంతో పలికింది.

ఈ మాటలు స్నేహలత వ్యక్తిత్వానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఆమెకు తన కుటుంబం పట్ల, ముఖ్యంగా తల్లిదండ్రుల మీద గల అపూర్వమైన ప్రేమానురాగాలు వెల్లడవుతున్నాయి. అలాగే తన చెల్లెలు, తమ్ముడి మీద స్నేహలత చూపించే వాత్సల్యాభిమానాలు కూడా ఈ మాటల ద్వారా మనకు వెల్లడవుతున్నాయి. స్నేహలత లేఖలోని ఈ మాటలు ఆమె కుటుంబ వాతావరణ నేపథ్యాన్ని, అందులోను ఆమె తల్లిదండ్రుల పెంపకాన్ని కూడా మనకు తెలియజేస్తున్నాయి. అంతేకాకుండా తాను ఆత్మాహుతి చేసుకోబోతున్నానని తెలిసి కూడా, మరణానికి భయపడని ఆత్మ స్థైర్యం, దృఢ సంకల్పం స్నేహలత మాటలలో మనకు కనిపిస్తున్నాయి.

అయితే ఆత్మాహుతికి సిద్ధపడిన స్నేహలత అందుకు తగిన మార్గాన్ని ఆలోచించింది. అగ్ని, జల, విషములలో ఏది ఉచితమైనది అని ఆలోచించింది. అగ్నిదేవుడు యాగాలలో హవిస్సులను అందుకునే పవిత్ర తేజోమూర్తి. అటువంటి అగ్నిదేవునికి నమస్సులు అర్పించి, 'దుర్గతో నన్ను చేర్చుము' అని స్నేహలత మనసులో వేడుకున్నది. ఆత్మాహుతికి సిద్ధమైన స్నేహలత చివరగా తండ్రికి ఆమె మనస్సులోని భావాలను, ఉన్నతమైన ఆశయాలను ఈ విధంగా తెలిపింది. 'ప్రియ జనకా! ఇక వెళ్లిపోతున్నాను. చిత్తశుద్ధితో నేను సమర్పించే ప్రణామాలను స్వీకరింపుము. తల్లి గర్భంలో ఉన్నట్లు ప్రకృతి ప్రశాంతంగా నిదురిస్తున్నది. మరల మేలుకొనుటకు ఆవకాశం లేని నిదురలోకి నేను కూడా ప్రవేశిస్తాను. నా సోదరీ సోదరులు నాకు సమర్పించే కన్నీటిమాలను ప్రేమతో నావద్దకు తీసుకురండి. నీవు అమ్మ వచ్చేంత వరకు ఎదురు చూస్తుంటాను. శుల్కమనే కళంకం నా కన్యత్వానికి సోకనీయక నన్ను కాపాడిన దక్షిణాగ్ని కళంక పూరితమైన ఈ సాంఘిక దురాచారాలను దహించి వేయును గాక!' అని స్నేహలత లేఖను ముగించింది.

**స్నేహలత వ్యక్తిత్వం:**

ఈ కావ్యంలో స్నేహలత వయస్సు పదిహేనేళ్లు. ఆ దశలో కన్యల అంతరంగాలు స్వచ్ఛంగా ఉంటూ, ప్రణయ భావాలు మొగ్గలు తొడుగుతుంటాయి. అదే సమయంలో సంఘంలోని దురాచారాల పట్ల తీవ్రమైన నిరసన కూడా ఆ లేత గుండెలలో గాఢంగా పొడచూపుతుంది. ఆదర్శబద్ధమైన హృదయం ఎంతటి త్యాగానికైనా సిద్ధమవుతుంది. నిస్వార్థమైన కన్యల స్వచ్ఛమైన ప్రణయం ధనాశాపరుడైన వరుని పాలై కళంకం చెందటం స్నేహలత వంటి ఆదర్శ నారీమణులు ఏమాత్రం భరించలేరు. వరకట్నం ఇవ్వనిదే తన పవిత్ర కన్యత్వం స్వీకారయోగ్యం కాలేదా అని ఆమె ప్రశ్నించుకున్నది. అంతేకాకుండా స్నేహలత దృష్టికి వరకట్న దురాచారం పరమ హేయం, లజ్జాకరం కూడా అయింది. అందుకే ఆ దురాచార నిర్మూలనకై తన ఆత్మ సమర్పణకు సాహసించుట అనేది స్నేహలత ప్రకృతికి సహజమైనదిగానే కనిపిస్తుంది. కన్నవారి కష్టాలను ఏ బిడ్డ కూడా సహించలేదు. సంస్కారం ఉన్నచోట త్యాగం కూడా ఉంటుంది.

స్నేహలత మహోన్నత సంస్కారవతి. కనుకనే ఆత్మార్పణ చేసుకొని తల్లిదండ్రుల కష్టాలను తొలగించాలని నిశ్చయించుకుంది. ఈ మహోదాశయ సాధనకై ప్రాణత్యాగాన్ని మించిన త్యాగం ఉండబోదు అని భావించి, ఆమె ఆత్మార్పణ మార్గాన్ని ఎంచుకున్నది. స్నేహలత తన పవిత్ర కన్యత్వానికి నీచమైన వరకట్న కళంకాన్ని సోకనీయకుండా తనను దగ్ధం చేసి, ఉద్ధరించిన అగ్ని దేవునికి అంజలి ఘటించింది. అదేవిధంగా తనను ఉద్ధరించిన ఆ దక్షిణాగ్ని సంఘంలోని దూరాచారాలను కూడా కాల్చివేయగలదని ఆమె గాఢంగా కోరుకున్నది. ఇటువంటి పరిణతబుద్ధి వల్లనే స్నేహలతలో పదిహేనేళ్ల ప్రాయానికే జ్ఞానం, భక్తి, సంస్కారం వంటి సుగుణాలు పడుగుపేకలుగా అల్లుకొని ఆమెను మహోన్నతమైన స్త్రీమూర్తినిగా రూపొందించాయి.

**ముగింపు:**

అనాదిగా భారతదేశంలో స్త్రీలు సతీ సహగమనం, కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాలకు బలికావటం అనేది ఎంతో దురదృష్టకరమైన వాస్తవం. వీటికితోడు వరకట్నం అనేది కూడా వ్యాప్తిలోకి వచ్చింది. దాని వలన సామాన్య కుటుంబాలలో జన్మించిన ఆడబిడ్డల పెళ్లిళ్లు గగన కుసుమాలు అయినాయి. అటువంటి దుర్భరస్థితిలో కన్నవారి బాధలను చూడలేక, కలకాలం కన్యలుగా ఉండి అపవాదులు పడలేక, వరకట్న దురాచారాన్ని మాన్పలేక, ఆత్మార్పణ చేసుకొన్న అభాగ్యవతులలో స్నేహలత కూడా ఉన్నది. రాయప్రోలు సుబ్బారావు గారు సాంప్రదాయ పద్ధతిలో రచించిన ఈ కావ్యాన్ని గురించి ఆచార్య సి నారాయణరెడ్డి గారు పేర్కొంటూ, "ఈ విధముగా సమకాలీనమైన సాంఘిక స్థితిగతులను చిత్రించుచు, వరశుల్క నిరసనము, భారతస్త్రీ ఆత్మోన్నత్యము అంగభూతములుగా గల విషాద మధుర కావ్యమిది." (నారాయణరెడ్డి, సి. 2001. పే. 261) అని 'విషాద మధుర కావ్యం'గా పేర్కొన్నారు. నారాయణ రెడ్డి గారి మాటల వలన రాయప్రోలు వారు ఈ కావ్యంలో సమకాలీనమైన సాంఘిక పరిస్థితులను వర్ణించిన తీరు తెలుస్తున్నది. అదేవిధంగా రాయప్రోలు వారు ప్రధానంగా వరకట్న నిరసన, సమయోచితంగా ఆంగ్ల పరిపాలన పట్ల విముఖతను కూడా వర్ణించారని మనం గ్రహించవచ్చు.

ఈ కావ్యంలో స్నేహలత తన తండ్రికి రాసిన లేఖలోని ప్రతి అక్షరం కూడా ఆమె విశుద్ధ హృదయాన్ని, మహోన్నతమైన సంస్కారాన్ని వెల్లడిస్తున్నాయి. ఈవిధంగా ఈ కావ్యంలో స్నేహలత తల్లిదండ్రుల పట్ల భక్తి కలిగిన యువతిగా, తోబుట్టువుల మీద అనురక్తి చూపించే సుగుణవతిగా, స్నేహశీలిగా, పవిత్రమైన ఆశయ సాధనకై ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన

ఆదర్శ నారీమణిగా కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

1. సుబ్బారావు, రాయప్రోలు. స్నేహలతాదేవి, 1914. నవ్య సాహిత్య పరిషత్తు, గుంటూరు
2. సీతారామయ్య, కురుగంటి. నవ్యాంధ్ర సాహిత్య వీధులు. 1994. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. డా. నారాయణ రెడ్డి, సి. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయాలు – ప్రయోగాలు. 2001. విశ్వంభరా విజన్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
4. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం. 2007. తెలుగు అకాడమీ, హైదరాబాదు.
5. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష. 2009. నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.